క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, తాను భారీ మెజార్టీతో గెలుస్తానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 7 గంటలకే పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ఆయనతో పాటు ఆయన సతీమణి శిల్పా భాగ్యలక్ష్మి, కుమారుడు శిల్పా కార్తీక్‌రెడ్డి, కోడలు మన్విత రెడ్డి, సోదరుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని, పేదల ప్రభుత్వం మరలా అధికారంలోకి రాబోతోందన్నారు. టీడీపీ నాయకుల్లో భయం పుట్టుకొని పలుచోట్ల ఘర్షణలకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరూ సమన్వయంతో ఉండాలన్నారు. శ్రీశైలంలో ఈవీఎంలు మోరాయిస్తుండటంతో పోలింగ్ మందకొడిగా సాగిందన్నారు. అత్యధికంగా ఓటు నమోదు కావడంతో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు.

శ్రీశైలంలో 80 శాతానికి పైగా ఓటింగ్


అంధుడైన కుమారుడిని ఓటు వేయించేందుకు తీసుకువస్తున్న తల్లి

శ్రీశైలం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఉదయం 6 గంటల నుంచి ఓటింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం క్యూ కట్టారు. మూడో నెంబర్ పోలింగ్ కేంద్రంలో మొరాయించడంతో ఒక గంట ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమయ్యింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత 10 పోలింగ్ కేంద్రాలు నిండిపోయాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 80 శాతం పైగా నమోదు కావడం విశేషం. శ్రీశైలంలోని 9వ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 85.6 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఉదయం 9 గంటలకు శ్రీశైలంలోని మేకలబండలో 5, 6 పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎదురుపడటంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అక్కడికి వచ్చి ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపివేశారు.

ఉదయం 6 నుంచే క్యూలో ఓటర్లు


డ్యాం డివిజన్ బూత్‌వద్ద బారులు తీరిన ఓటర్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 6 గంటలకే ఓటర్లు పోలింగ్ స్టేషన్ల వద్దకు చేరుకున్నారు. మాక్‌పోలింగ్ ముగిసిన తరువాత 7.30 నుంచి పోలింగ్ ప్రారంభమైంది. సున్నిపెంటలోని సెంట్రల్‌లో కాలిటీ ఎలిమెంటరీ పాఠశాలలో 19వ బూత్‌లో పలుమార్లు ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు నిరీక్షించాల్సి వచ్చింది. 10.30గంటలకు ఈవీఎం మోరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. మళ్లీ 11.20కి ప్రారంభమయ్యింది. 12 గంటలకు మళ్లీ ఈవీఎం మోరాయించింది. ఈవీఎంను మార్చడంతో పోలింగ్ యథావిధిగా కొనసాగింది. శ్రీశైలంలో 10 పోలింగ్ కేంద్రాలలో 8,231 మంది ఓటర్లు ఉండగా 5,911 మంది, సున్నిపెంటలో 16 పోలింగ్ కేంద్రాలలో 13,750 మంది ఓటర్లకు గాను 9,578 మంది, లింగాలగట్టులో పోలింగ్ కేంద్రంలో 813 మంది ఓటర్లు ఓటు వేశారు. శ్రీశైలం మండలంలో మొత్తం ఓటర్లు 22,056 మంది ఓటర్లు ఉండగా, 16,302 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 70.70 శాతం పోలింగ్ నమోదయ్యింది.

రాత్రి 8.30 వరకు ఓటింగ్


వేలికి సిరా వేయించుకుంటున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

జూపాడుబంగ్లా: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఓటుహక్కును వినియోగించుకొనేందుకు ఓటర్లు ఉదయం 6.30గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. రాత్రి 8.30గంటలైనా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. పారుమంచాలలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, అపర్ణ దంపతులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి ఆయన స్వగ్రామమైన పారుమంచాలలోని 156 పోలింగ్‌బూతులో ఓటుహక్కును వినియోగించుకున్నారు. తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, మండ్లెం, తూడిచెర్ల, పారుమంచాల తదితర పోలింగ్ కేంద్రాలను శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా పరిశీలించారు.


ఓటరు తీర్పు నిక్షిప్తమైన ఈవీఎంలు


తూడిచెర్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి


వేంపెంట గ్రామంలో క్యూలో నిల్చోలేక షామియానాల కింద కూర్చున్న మహిళలు


వేంపెంటలో ఓటుహక్కు వినియోగించుకొని పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న వికలాంగుడు


బొల్లవరంలో ఓటు వేసి వస్తున్న వృద్ధుడు

ఓటెత్తారు..!

- ఉదయం నుంచే బూత్‌ల వద్ద బారులు తీరిన ఓటర్లు
- ఓటేసేందుకు ఉత్సాహం చూపిన యువ ఓటర్లు
- కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు పోలింగ్


పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు

నందికొట్కూరు: ఓటరు చైతన్య ముందు సమయం చిన్నబోయింది. నందికొట్కూరు నియోజకవర్గ ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉదయం 7 గంటలకే ఓటర్లు పోటెత్తారు. సోమవారం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల ఎన్నికల పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. కొన్ని కేంద్రాల్లో పావుగంట ముందే ముగిసింది. మరికొన్ని పోలింగ్ కేంద్రాల్లో 6 గంటలలోపు కేంద్రాల్లో క్యూలో నిల్చిన వారందరికీ ఓటేసేందుకు అనుమతించగా.. రాత్రి 10 వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఒక్కో కేంద్రంలో నలుగురు, ఐదుగురు సిబ్బందిని నియమించారు. అన్ని కేంద్రాల వద్ద వివిధ కంపెనీలకు చెందిన కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర పోలీసులను బందోబస్తు నియమించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ పట్టణంలోని హాజీనగర్ ఉర్దూ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ పోలింగ్ సరళిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పరిశీలించారు. నియోజకవర్గంలో పలు గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ఉత్సాహం చూపిన ఓటర్లు

నందికొట్కూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో ఎక్కడ చూసినా క్యూలైన్లు కనిపించాయి. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులు మొదలుకుని వృద్ధుల వరకు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. మండలాల్లో ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. కొత్తపల్లి మండలంలో గిరిజనులతో పాటు అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని పోలైన ఓట్లను బట్టి తెలుస్తోంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అంతంటా 70 నుంచి 80 శాతం వరకు ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం పురుషులు–1,06,689, మహిళలు–1,1,11,340 ఇతరులు–18 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం కలిపి 2,18,047 మంది ఓటర్లు ఉన్నారు. కాగా వీరిలో సోమవారం జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,78,966 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు వేసి సిరాను చూపిస్తున్న వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్

ఉదయం నుంచి మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి జోరందుకుంది. ఉదయం 9 గంటలకు 4.25 శాతం పోలవ్వగా 10 గంటలకు 10.6, 11 గంటలకు 12.50, 12 గటంలకు 28.69 1గంటకు 42.60, 3 గంటలకు 56.75, 5 గంటలకు 67.24, రాత్రి 10 గంటల వరకు 82.08 శాతం పోలింగ్ నమోదయ్యింది.

ప్రజా తీర్పు నిక్షిప్తం

శాసనసభ ఎన్నికల్లో పోటీపడిన అభ్యర్థులకు ప్రజలు తమ ఓటు ద్వారా ఇచ్చిన తీర్పు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లో నిక్షిప్తమై ఉంది. శాసనసభ ఎన్నికల ఫలితాల ఉత్కంఠకు తెర దించేందుకు నెల రోజుల గడువు ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ సిబ్బంది ప్రక్రియ ముగిసిన వెంటనే ఓటింగ్ యంత్రాలను నంద్యాల పార్లమెంట్ కేంద్రానికి తరలించారు. వీవీప్యాట్‌లు, ఈవీఎంలకు సీల్ వేసి వారికి కేటాయించిన బస్సుల్లో నంద్యాల పార్లమెంట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపర్చేందుకు తీసుకెళ్లారు. దూర ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ సిబ్బంది నంద్యాల పార్లమెంట్ కేంద్రానికి చేరుకునేవరకు రాత్రి ఆలస్యం అయ్యింది. దీంతో ఆయా సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఆలస్యంగా ఇవ్వాల్సి వచ్చింది. కాగా నందికొట్కూరు నియోజకవర్గంలోని 6 మండలాలకు సంబంధించిన ఓటింగ్ యంత్రాలను నంద్యాల పార్లమెంట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు.


ఓటు వేసిన మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి


ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

భారీ బందోబస్తు

నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా 36 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం పెంచి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలు కలిపి 251 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను జియోట్యాగింగ్ సైతం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని మోహరించారు. ట్రైనీ ఎస్పీలు–3, అడిషనల్ ఎస్పీ–1, డీఎస్పీ–2, సీఐలు–4, ఎస్‌ఐలు–7, ఏఎస్‌ఐలు–50, పీసీలు–300, హోంగార్డులు–200, బీఎస్ఎఫ్–52, ఆర్‌పీఎస్ఎఫ్–80 మంది బందోబస్తు విధులు నిర్వహించారు.

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 6.30 నుంచే ఓటర్లు బారుదీరారు. సాయంత్రం 6 దాటాక కూడా ఓటర్లు క్యూలో ఉండటంతో 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. కాగా మండలంలో 74.2 శాతం పోలింగ్ జరిగినట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ మండలంలోని తుమ్మలూరు, వాడాల, మద్దూరు, మిట్టకందాల, పాములపాడు, ఎర్రగూడూరు, ఇస్కాల గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలోని వేంపెంట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామాల్లోని పోటింగ్‌భూతుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ అశోక్ గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.


కొత్తపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్లలో నిలబడిన ఓటర్లు

ఎన్నికలు ప్రశాంతం..

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించడంతో పాటు నెమ్మదిగా పనిచేయండతో ఓటింగ్ కొంత ఆలస్యం అయింది. బిజినవేముల గ్రామంలో జరుగుతున్న ఓటింగ్ సరళిని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి పరిశీలించారు. ఉదయం కాస్త వర్షం కురిసి వాతావరణం చల్లగా ఉండటంతో ఓటు వేసేందుకు మహిళలు, వృద్ధులు, వికలాంగులు భారీగా తరలి వచ్చారు. అల్లూరు, బ్రాహ్మణకొట్కూరులో సాయంత్రం ఆరు గంట తర్వాత కూడా ఓటు వేసేందుకు ప్రజలు క్యూలో నిలుచున్నారు.


పగిడ్యాలలో ఓటు వేయడానికి వస్తున్న వికలాంగురాలు, వృద్ధురాలు,

కొత్తపల్లి: మండలంలో మొత్తం 25,374 మంది ఓటర్లకు గాను 21,437 మంది ఓటర్లు 37 పోలింగ్ కేంద్రాల్లో వారి ఓటు హక్కును వినియోగించుకుకోగా 84.48శాతం పోలింగ్ నమోదయ్యింది. సింగరాజుపల్లె, ఎదురుపాడు, శివపురం, కొత్తపల్లి, దుద్యాల గ్రామాలలో ఈవీఎంలు నిదానంగా పనిచేయడంవల్ల రాత్రి కూడా ఓటింగ్ కొనసాగింది. ఎస్‌ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 45 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఎన్నికల సరళిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్ పరిశీలించారు.


మాసపేట పోలింగ్ కేంద్రం వద్ద వైద్య సిబ్బంది మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పగిడ్యాల: ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ ప్రక్రియ మాక్ పోల్ కారణంగా అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో ఓటర్లు తీవ్ర అసహనానికి లోనయ్యారు. పగిడ్యాలలోని 97, 98, 101 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు బారులు తీరారు. రాత్రి 8 గంటలు అయిన ఓటర్ల క్యూ తగ్గలేదు. పాత ముచ్చుమర్రి జిల్లా పరిషత్‌లోని పోలింగ్ కేంద్రంలో నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ బైరెడ్డి మల్లికార్జున రెడ్డి, బైరెడ్డి ఉషారాణి, డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి ఓటు వేశారు. ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

మిడుతూరు: మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను 41 పోలింగ్ కేంద్రాల్లో మండలంలో మొత్తం 36,237 మంది ఓటర్లు ఉన్నారు. చింతలపల్లి గ్రామంలో ఓ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ఓ గంట సేపు మోరాయించింది. అదేవిధంగా కడుమూరు గ్రామంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మోరాయించడంతో పోలింగ్ దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. కలమందలపాడులో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో రాత్రి 9 గంటల తరువాత కూడా ఓటింగ్ కొనసాగింది.


గాజులపల్లెలో 218 పోలింగ్ కేంద్రంలో ఆరు గంటలు దాటినా క్యూలో నిలబడిన ఓటర్లు

మహానందిలో ఇరు వర్గాల వాగ్వాదం

మహానంది: మహానంది మండలంలో కొన్ని చోట్ల చెదురు మొదురు ఘటనలు మినహా మిగతా కేంద్రాల్లో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రమైన తిమ్మాపురం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఓటింగ్ ప్రక్రియ కాస్త ఆలస్యంగా సాగింది. బుక్కాపురం గ్రామంలో టీడీపీ నేతలు ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గాజులపల్లె గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఫలానా గది అని చెబుతుంటే ప్రచారం చేస్తున్నారంటూ టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మండల కేంద్రమైన తిమ్మాపురం గ్రామంలో ముగ్గురు హిజ్రాలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, వికలాంగులు సహాయకుల సాయంతో పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గాజులపల్లె మజరా గ్రామమైన బసవాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ ప్రక్రియ నిదానంగా సాగడంతో ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో క్యూలో నిలబడిన మహిళల మధ్య ముందు వెనక అంటూ మొదలైన వాగ్వాదం ఒకరిని ఒకరు కొట్టుకోవడానికి దారితీసింది. మహానంది మండలంలోని సమస్యాత్మక గ్రామమైన సీతారామాపురంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, సీఐ శివకుమార్ రెడ్డి, మహానంది ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మహానంది మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని శ్రీశైలం నియోజకవర్గం యువనేత శిల్పా కార్తీక్ రెడ్డి ఎప్పటికప్పుడు గ్రామాలకు చేరుకుని పరిశీలిస్తూ నాయకులకు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురంలో పోలింగ్ కేంద్రం వద్దకు టీడీపీ నాయకులు పదేపదే సంచరిస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.


తిమ్మాపురంలో ఓటుహక్కు వినియోగించుకున్న హిజ్రాలు


సీతారామాపురంలో పోలీసు బందోబస్తు

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్..


బొల్లవరంలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు

మండలం గాజులపల్లె గ్రామంలోని ఉర్దూ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన 218వ పోలింగ్ కేంద్రంలో సాయంత్రి 6 దాటిన తర్వాత కూడా భారీగా ఓటర్లు క్యూలో ఉండటంతో ఓటింగ్ రాత్రి వరకు కొనసాగింది. గాజులపల్లె, గాజులపల్లె ఆర్ఎస్‌లో రాత్రి 10 గంటలు దాటే వరకూ పోలింగ్ జరిగింది. మహానంది మండలంలో 85.59 శాతం పోలింగ్ నమోదయ్యింది. బండిఆత్మకూరు మండలంలో 89.59 శాతం ఓటింగ్ జరిగింది. సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున వందల సంఖ్యలో ఓటర్లు అవస్థలు పడ్డారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో చీకటి ఉండడంతో పోలింగ్ సిబ్బందితో పాటు ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- శ్రీశైలం నియోజకవర్గంలో భారీగా పోలింగ్
- పలుచోట్ల ఈవీఎం మిషన్లు పనిచేయక ఓటింగ్ ఆలస్యం
- ఆత్మకూరులో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కుటుంబ సభ్యులు


శ్రీశైలంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో భారీ పోలింగ్ జరిగింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమై కొన్ని గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గ వ్యాప్తంగా 81.27 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఉదయం 7 గంటలకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బంది ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. అయితే ఆత్మకూరు పట్టణంలోని 66వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్ పనిచేయకపోవడంతో అర గంట పాటు పోలింగ్ ఆలస్యమయ్యింది. 57వ పోలింగ్ కేంద్రం వెంగళరెడ్డినగర్‌లో కూడా ఈవీఎం ప నిచేయకపోవడంతో ఎంపీకి కేటాయించిన ఈవీఎం మిషన్ ఇక్కడ ఉదయం 7 గంటల నుంచి మ.ద్యాహ్నం 1 గంటలోపు దాదాపు మూడుసార్లు మో రాయించడంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు.

ఉదయం నుంచి బారులు దీరిన ఓటర్లు

ఆత్మకూరు మండలంతో పాటు వెలుగోడు, మహానంది, బండిఆత్మకూరు, శ్రీశైలం ఇలా అన్ని మండలాల్లో ఉదయం 7 గంటల నుంచ ఓటర్లు బారులుదీరారు. పలుచోట్ల ఈవీఎం మిషన్లు పనిచేయకపోవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, నియోజకవర్గంలో 226 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఆర్వో సుధారాణి తెలిపారు.

పోలింగ్ శాతం ఇలా..

నియోజకవర్గంలో 1,96,116 మంది ఓటర్లకు గానూ 1,42,651 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల వరకు శ్రీశైలం నియోజకవర్గంలో కేవలం 10 శాతం మాత్రమే పోలింగ్ జరగగా, 11 గంటలకు నియోజకవర్గంలో 27.5 శాతం పోలింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం ఒంటి గంటలకు నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, శ్రీశైలం, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో కేవలం 43.63 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 3 గంటల అనంతరం నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియ కొంత వేగంగా పుంజుకొని పోలింగ్ 59.15 శాతం నమోదయ్యింది. సాయంత్రం 5 గంటల సమయానికి 72.74 శాతం ఎన్నికల పోలింగ్ జరిగింది.


కుటుంబ సభ్యులతో కలసి ఓటుహక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఓటేసిన ప్రముఖులు

ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఉదయం తన కుటుంబ సభ్యులతో ఆత్మకూరు మార్కెట్ యార్డులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని వేల్పనూరు గ్రామంలో టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషిరెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ మంత్రి ఏరాసుప్రతాపరెడ్డి ఆత్మకూరు పట్టణంలో ఓటు వేశారు. ఆత్మకూరు పట్టణంలో 84 సంవత్సరాలు వయస్సు కలిగిన వెంకటలచ్చమ్మ అనే వృద్ధురాలు పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇలా మంది వృద్ధులు, వికలాంగులు నూతనంగా ఓటుహక్కు పొందిన యువతీ, యువకులు కూడా తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు.


కుటుంబసభ్యుల సాయంతో పోలింగ్ కేంద్రానికి నడిచి వస్తున్న 84 ఏళ్ల వెంకటలచ్చమ్మ

వెలుగోడులో 81.9 శాతం పోలింగ్


వేల్పనూరులో ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి

వెలుగోడు: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 8 గ్రామ పంచాయతీలలో మొత్తం 47 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 42,344 ఓటర్లు ఉండగా 34,383 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 81.9 శాతం ఓట్లు పోలైనట్లు ఆర్ఓ విజయకుమారి తెలిపారు. వేల్పనూరులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి దంపతులు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు, వాగ్వాదాలు మినహా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగభూషణం, ఎస్‌ఐ భూపాలుడు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.